

సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 9: ఉమ్మడి జిల్లాలోని విజయనగరం ఎక్సైజ్ కోర్టు, పార్వతీపురం, కొత్తవలస, సాలూరు కోర్టుల్లో స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కళ్యాణచక్రవర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ గౌరవ వేతనంపై నియమించనున్నట్లు చెప్పారు. ఈ నెల 22లోగా దరఖాస్తులను జిల్లా న్యాయస్థానానికి అందజేయాలన్నారు. వివరాల కోసం పరిపాలనాధికారి, జిల్లా న్యాయస్థానాన్ని సంప్రదించాలని కోరారు.

ఇంట్లోకి వెళ్లకముందే.. అప్పుల భారం

ప్రభుత్వం మంజూరు చేసిన ఇంట్లోకి ఇంకా వారు అడుగుపెట్టలేదు. ఇంతలోనే ఇళ్ల కోసం చేసిన అప్పు చెల్లించాలని బ్యాంకులు నోటీసులు అందించాయి. తీసుకున్న రుణాన్ని తక్షణమే చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో ఏమి చేయాలో తెలియక వారు లబోదిబోమంటున్నారు. ఇదీ బొబ్బిలిలోని టిడ్కో గృహాల లబ్ధిదారుల పరిస్థితి.



- టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకుల నోటీసులు
- రుణం తిరిగి చెల్లించాలని ఒత్తిడి
- లబోదిబోమంటున్న వైనం

(బొబ్బిలి)

బొబ్బిలి పట్టణంలోని రామన్నదొరవలస సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు సమీపంలో టీడీపీ ప్రభుత్వ హయాం లో టిడ్కో ఇళ్లను నిర్మించారు. అప్పట్లో లాటరీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇంతలో ప్రభుత్వం మారి పోవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో టిడ్కో ఇళ్లకు శాపంలా మారింది. రివర్స్ టెండరింగ్ పేరుతో ఈ ఇళ్ల సముదాయం టెండర్లను ప్రభుత్వం రద్దు చేసింది. 25 శాతం నిర్మాణం దాటిన వాటిని మాత్రమే కొనసాగించి మిగిలిన ఇళ్లను రద్దు చేసింది. ఆ పక్కనే జగనన్న కాలనీ అంటూ మరో పేరు పెట్టి కొత్తగా లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు.

బ్యాంకుల నుంచి రుణం..

టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు బ్యాంకుల నుంచి లబ్ధిదారుల పేరుతో రుణం ప్రభుత్వం వాడింది. ఆ రుణాలతో ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి చేయలేదు. ఈలోగా రుణాల వాయిదాలను చెల్లించాలని బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరగడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని పేదల కోసం 1095 ఇళ్లను నిర్మిస్తున్నారు. అలాగే, 28 బ్లాకుల్లో 300 చదరపు అడుగుల చొప్పున 1344 ఇళ్లు, 365 చ.అ. చొప్పున ఒక బ్లాకులో 48 ఇళ్లు, 430 చ.అ చొప్పున ఆరు బ్లాకుల్లో 288 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. అవి పూర్తి కాలేదు. 430 చదరపు అడుగుల ఇళ్లకు 85 శాతం చొప్పున రుణాలను మంజూరు చేశారు. 365, 430 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి 285 మంది లబ్ధిదారులకు, 300 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి 1232 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు తప్ప వారికి ఇళ్లను ఇంకా అప్పగించలేదు. ఈలోగా బ్యాంకుల నుంచి రుణవాయిదాలు చెల్లించాలని వస్తున్న మెసేజ్‌లు చూసి లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. సొంత ఇంటి కల నెరవేరలేదు సరికదా అప్పుల భారం పెనుభూతంలా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా అప్పగించని టిడ్కో ఇళ్లకు బ్యాంకు రుణాలను ఎలా చెల్లించగలమని లబ్ధిదారులు వాపోతున్నారు.



బొబ్బిలిలో టిడ్కో ఇళ్ల సముదాయం

ఈ భారం మోయలేం..

2019లో మా అందరికీ బహుళ అంతస్తు భవనాల్లో ఇళ్లను కేటాయించడంతో ఎంతో సంతోషించాం. సొంత ఇళ్లల్లోకి వెళ్తామని ఆనందపడ్డాం. ఐదేళ్ల అయినా మా కల నెరవేరడం లేదు. పైగా బ్యాంకుల నుంచి అప్పులకు సంబంధించి నోటీసులు వస్తున్నాయి. ఈ భారాన్ని ఎలా మోయగలమోనని భయమేస్తోంది. ఎటువంటి రుణ బాధలు లేకుండా పేదల సొంతింటి కలను సాకారం చేయాలి.



-లొట్టి పద్మ, కాకల పద్మ, టిడ్కో లబ్ధిదారులు, గొల్లపల్లి, బొబ్బిలి

పత్తి కొనుగోలు ఎప్పుడో?



- మూడు నెలలు కావస్తున్నా కిలో కూడా కొనలే
- రైతుల పేర్ల నమోదుకే పరిమితం
- నిబంధనలకు జడిసి దళారులకు విక్రయిస్తున్న పంట
- అవగాహన కల్పించని అధికారులు



రైతులు పండించిన పత్తి

'రైతుల నుంచి మద్దతు ధరకే పత్తి కొనుగోలు చేస్తాం. వారంలోగా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7.020 కంటే తక్కువకు కొనుగోలు చేస్తే వ్యాపారులపై కేసులు పెడతాం. కొనుగోలు కేంద్రాలకు రైతులు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలి.' అని ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు చెప్పారు. కానీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం లేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మూడు నెలలు అవుతున్నా ఇంత వరకు ఒక్క కేజీ పత్తిని కూడా కొనుగోలు చేయలేదు. ప్రభుత్వ నిబంధనలకు జడిసి రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. అవగాహన కల్పించాల్సిన అధికారులు పత్తా లేకుండా పోతున్నారు. దీంతో తక్కువ ధరకు పంటను అమ్ముకొని రైతులు నష్టపోతున్నారు.

(రాజాం)

ఉమ్మడి జిల్లాలో రాజాం, సాలూరు, భామిని మండలాల్లో గతేడాది నవంబరు 18న పత్తి కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7,020 మద్దతు ధర ప్రకటించింది. అయితే, ఏ కేంద్రంలో కూడా ఇంతవరకు ఒక్క కిలో పత్తిని కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. రాజాం మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో కొనుగోలు కేంద్రం ప్రారంభించిన తరువాత 8 మంది రైతులు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకుని వెళ్లిపోయారే తప్ప ఇంతవరకు ఒక్కరూ కూడా పంటను విక్రయించలేదు. ఉమ్మడి జిల్లాలో 14,835 ఎకరాల్లో పత్తి పంట సాగైంది. ఎకరాకు మూడు క్వింటాల చొప్పున 44,505 వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని 10 మండలాల్లో 350 ఎకరాల్లో పత్తి వేశారు. 1050 క్వింటాళ్ల దిగుబడులు రావచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, పంట విక్రయానికి పలు నిబంధనలు ఉండడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. మద్దతు ధర కంటే రూ.700 తక్కువకు అమ్ముకోవాల్సి వస్తుందని రాజాంకు చెందిన రైతులు కె.అప్పలనాయుడు, గార గున్నం నాయుడు. టంకాల రాము, వి.సత్య నారాయణ తదితరులు వాపోతున్నారు.



రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం

నిబంధనలతో రైతుల వెనుకడుగు..

పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొన్ని నిబంధనలు విధించింది. మద్దతు ధర రూ.7,020 దక్కాలంటే పత్తిలో తేమ 8 శాతం మాత్రమే ఉండాలి. కాయి మచ్చ కూడదు. అంతే కాకుండా ఆన్‌లైన్‌లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. పంట విక్రయిం చిన తరువాత డబ్బులను వారికి నేరుగా ఇవ్వకుండా బ్యాంకు ఖాతాలకు జమచేస్తుంది. అంతే కాకుండా వాహనం అద్దె, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులు కూడా రైతులే భరించాలి. ఈ నిబంధనలు చూసి రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. కొందరికి ఈ క్రాప్ సమస్య కూడా ఎదురవుతుంది. వ్యవసాయశాఖ అధికారులు ఈ క్రాప్ నమోదు చేసినా మార్కెటింగ్ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినపుడు రైతుల పేర్లు కనిపించడంలేదు. దీంతో రైతులు ఏఎంసీ నుంచి రైతుభరోసా కేంద్రాలకు వెళ్లి సమస్య పరిష్కరించుకోవాల్సి వస్తుంది. అంతే కాకుండా పత్తి కొనుగోలు విషయంలో అధికారులు కూడా ప్రత్యేక దృష్టి పెట్టలేదు. ఏదో నామ మాత్రంగానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు తప్ప గ్రామాల్లో ప్రచారం చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు తక్కువ ధరకే దళారులకు పంటను విక్రయించి నష్టపోతున్నారు.

అగ్నిమాపక శాఖ అభ్యంతరం..

ఉమ్మడి జిల్లాలోని మూడు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పత్తిని రామభద్రపురం మండలంలోని పాత్రుని జిన్నింగ్ మిల్లుకు రైతులు తరలించాలి. ఈ మిల్లులో అగ్ని ప్రమాదాలకు సంబంధించి ఎలాంటి రక్షణ చర్యలు లేవని, ఇక్కడకు పంటను తీసుకురావద్దని జిల్లా అగ్నిమాపక శాఖ అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. ప్రమాదం జరిగి పంట దగ్ధమైతే ఎవరిది బాధ్యతని ప్రశ్నించినట్లు సమాచారం. రైతుల పరిస్థితి ఏంటి, బీమా ఎంత వరకు చేయించాలి, తదితర విషయాలపై సీసీఐ అధికారులను ప్రశ్నించింది. తక్షణమే మిల్లులో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని ఆదేశించింది. ఇవి జరిగిన తరువాతనే పత్తిని మిల్లుకు తరలించాలని సూచించింది.

అవగాహన కల్పించాం..

కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకురావాలని రైతులకు అవగాహన కల్పించాం. కానీ, కొన్ని నిబంధనలు అమలు చేయడంతో వారు ఎవరూ ముందుకు రావడంలేదు. ప్రభుత్వ ధర ఎక్కువగానే ఉంది. అయినా రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది రైతులు కొనుగోలు కేంద్రాలకు వచ్చి వారి పేర్లను నమోదు చేసుకొని వెళ్లిపోయారు. పత్తిని మాత్రం తీసుకురాలేదు.

-బి.శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి, రాజాం



మాట్లాడుతున్న పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్, తదితరులు

ఎమ్మెల్యే కోలగట్ల పాలనకు చరమగీతం పాడుతాం

- వ్యాయామ కేంద్రానికి 'కోలగట్ల' పేరును ఎలా పెడతారు?
- వైసీపీ అసమ్మతి నేతలు

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 9: విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి నియంతృత్వ ధోరణిపై పోరాడుతామని వైసీపీ అసమ్మతి నేతలు పిల్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్, తదితరులు అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 35వ డివిజన్‌లో ఎప్పటి నుంచో ఉన్న పురాతన వ్యాయామ కేంద్రానికి 'కోలగట్ల' వ్యాయామ శాలగా పేరును పెడుతూ నగరపాలకసంస్థ అత్యవసర సమావేశంలో తీర్మానం చేయడం దారుణమన్నారు. మహానుభావులు ఎన్టీఆర్, వైఎస్సార్ వంటి వారి పేర్లను కాదని 'కోలగట్ల' పేరు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. కార్పొరేటర్లకు సైతం కనీస మర్యాదలు లేకపోవడం దారుణమన్నారు. చాలా మంది కార్పొరేటర్లతో పాటు వైసీపీ నాయకులు ఎమ్మెల్యేపై తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. కోలగట్ల నియంత, కుటుంబ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నేతలు గాడు అప్పారావు, రౌతు శ్రీనివాసరావు, రౌతు చంటి తదితరులు పాల్గొన్నారు.



హౌసింగ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

సదుపాయాలు ఇంకెప్పుడు కల్పిస్తారు?

- హుద్‌హుద్ కాలనీ వాసుల ఆందోళన

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 9: 'హుద్ హుద్ ఇళ్ల వద్ద రెండు రోజుల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వైసీపీ ప్రభుత్వం 2021లో హామీ ఇచ్చింది. మూడేళ్లవుతున్నా పట్టించుకోవడం లేదు. ఇంకెప్పుడు సదుపా యాలు కల్పిస్తారు?' అంటూ హుద్‌హుద్ కాలనీ వాసులు శుక్రవారం ఆందోళనకు దిగారు. సీపీఎం ఆధ్వర్యంలో గృహ నిర్మాణశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డీఈని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యు డు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ.. 2014లో హుద్‌హుద్ తుఫాను బాధితులకు లంకాపట్టణం వద్ద నిర్మించిన ఇళ్లను 2019లో అప్పగించారని తెలిపారు. కానీ, నేటికీ విద్యుత్, తాగునీటి సదుపాయం లేదన్నారు. దీంతో అక్కడ నివాసం ఉండలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హుద్‌హుద్ గృహ లబ్ధిదారులు రమణమ్మ, జగదాంబ, పి.రమణమ్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డీఈవోగా ప్రేమకుమార్ బాధ్యతలు

కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎన్.ప్రేమకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పార్వతీపురం మన్యం జిల్లా నుంచి పదోన్నతిపై బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ పని చేసిన బి.లింగేశ్వరరెడ్డి పదోన్నతిపై గుంటూరు ఆర్‌జేడీగా వెళ్లారు. అలాగే, డిప్యూటీ డీఈవో వాసుదేవరావు పదోన్నతిపై రాజమండ్రి డీఈవోగా వెళ్లారు. దీంతో ఆయన శుక్రవారం రిలీవ్ అయ్యారు. డీఈవో ప్రేమకుమార్‌కు కార్యాలయ సిబ్బంది, ఎస్టీయూ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈవో ప్రేమకుమార్

ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలి

- బీఎల్వోలకు చార్జీ మెమోలు
- కలెక్టర్ నాగలక్ష్మి

కలెక్టరేట్, ఫిబ్రవరి 9: ఓటర్ల సవరణ కోసం వచ్చిన ఫారం 6,7,8 దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గడువు దాటిన తరువాత దరఖాస్తులు పెండింగ్ ఉండకూడదని సూచించారు. ఫారం 7 దరఖాస్తులను జిల్లా ఎన్నికల అధికారికి పంపాలని, మిగిలిన ఫారాలు ఈఆర్‌వో స్థాయిలోనే పరిష్కరించాలని చెప్పారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కనీస సదుపాయలు ఉండాలని, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ తదితర పనులను వెంటనే పూర్తి చేసి ఈ నెల 15న రిపోర్టును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలు వద్ద ఉన్నాయని, వాటితో పనులు చేయాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ మార్పులు ఎక్కడైనా అనివార్యమైతే ఈఆర్‌వోలు వారంలోగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. దీనిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించాలని, ఎలాంటి ఫిర్యాదులు, సమస్యలు లేవని నిర్ధారించుకున్నాకే ప్రతిపాదనలు పంపాలని చెప్పారు. ఎన్నికలు కమిషన్ ఒక్కసారి ఆమోదం ఇచ్చిన తరువాత మార్పడానికి అవకాశం ఉండదని, ముందే తనిఖీ చేసి పంపాలని స్పష్టం చేశారు. ఎక్కువగా తప్పులు ఉన్న బీఎల్వోలకు చార్జీ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్వో అనిత తదితురులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

మా సమస్యలు పరిష్కరించాల్సిందే

- ప్రశ్నించేవారి గొంతు నొక్కడం సరికాదు
- ఆశా వర్కర్ల నిరసన



ఎల్.కోటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కలెక్టరేట్/లక్కవరపుకోట, ఫిబ్రవరి 9: తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిందేనని ఆశా కార్యకర్త లు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా తమను గృహ నిర్బంధించడం దారుణమన్నారు. రైళ్లు, బస్సుల్లో బయలుదేరిన తమను అడ్డుకుని అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో వైసీపీ నియం తృత్వ పాలన సాగిస్తుందని, ప్రశ్నించేవారి గొంతుకను నొక్కేస్తుందని మండిపడ్డారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్, రూ.10లక్షల ప్రమాద బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు నరేష్, జగన్మోహన్‌రావు, రాకోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర కార్యదర్శి వెంకటలక్ష్మి, సంఘ నాయకులు సుజాత, గౌరీ, సునీత, ఈశ్వరమ్మ పాల్గొన్నారు. ● లక్కవరపుకోటలో సీఐటీయూ నేతలు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. విశాఖ-అరకు రోడ్డు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో గొల్లదేవి, ఈశ్వరమ్మ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

రాష్ట్రం బాగుండాలంటే టీడీపీ రావాల్సిందే

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 'భవిష్యత్తుకు గ్యారెంటీ'
● సూపర్‌సిక్స్ హామీలను ప్రజలకు వివరించిన టీడీపీ నాయకులు


విజయనగరంలో అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో..


మక్కువలో సంధ్యారాణి ఆధ్వర్యంలో..


గరుగుబల్లి: గిజబలో వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో..


వంగర: కింజంగిలో..

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9: రాష్ట్రం సురక్షితంగా ఉండాలంటే టీడీపీ-జనసేన కూటమి పాలనే రావాలని, దీనికి ప్రజలంతా రానున్న ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతి రాజు అన్నారు. 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆమె 50 వ డివిజన్‌లో గాజులరేగ రాళ్లవీధిలో పర్యటించారు. టీడీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పత్తిగిల్లి సూర్యకుమారితో పాటు, సియ్యాదుల సీతమ్మ, తోట రమేష్, గెద్ద రమేష్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ ప్రభుత్వం అన్నింటా విఫలమైందన్నారు, అన్ని రంగాలను సర్వనాశనం చేసిందన్నారు. టీడీపీ నగర నాయకులు, అనుబంధ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● **మక్కువ:** రాష్ట్రంలో అభివృద్ధి కావాలంటే మళ్లీ చంద్రబాబే అధికారంలోకి రావాలని టీడీపీ సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి అన్నా రు. మక్కువలో శుక్రవారం ఆమె 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాల నలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయని, ఏడుసార్లు విద్యుత్తు చార్జీల ను పెంచారని అన్నారు. గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, కార్యదర్శి గౌరీ శంకర్, నాయకుడు మావుడి ప్రసాదరావు, డాక్టర్ పి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజల ఆశలు నెరవేరుతాయని తెలుగుదేశం నాయకుడు కూనిశెట్టి భాస్కరరావు అన్నారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడిపోయిందని, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రజలకు తీరని నష్టం చేసిందని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు అడపా అప్పలకొండ, కార్యకర్తలు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ అన్నారు. శుక్రవారం గిజబ పంచాయతీలో బా బు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నా యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగర: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు వేమిరెడ్డి శ్రీను, పిన్నింటి మోహన్, ఎల్.కృష్ణమూర్తి తదితరులు అన్నారు. కింజంగి, చంద్రంపేట, వంగర, మరువాడ, కోనంగిపాడు తదితర గ్రామాల్లో శుక్ర వారం 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లను మాయ మాటలతో భయ పెడుతున్నారని, ఇది ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. త్వరలో జగన్ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయన్నారు. నాయకులు ధనలక్ష్మి, శ్రీను, వి.మురళి, రవి, నల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: ఆరికతోటలో..

'భవిష్యత్తుకు గ్యారెంటీ'పై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పాలకొండ మండలం నుంచి టీడీపీ నాయకులు బిడ్డిక దమయంతినాయుడు, సవర మాలయ్య, బిడ్డిక చంద్రరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, అడ్డాకుల నరేష్, శ్రీను, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దమయంతినాయుడు

విద్యార్థులను తీర్చిదిద్దాలి

బొబ్బిలి: విద్యార్థుల మనస్తత్వాల అనుగుణంగా వారిని తీర్చిదిద్దాలని మండల విద్యాశాఖాధికారి చల్ల లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పిరిడి జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఈఆర్‌టీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్-ఫేజ్4 (ఈఎండీపీ)లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు సమస్యను గుర్తించి వారికి సమర్థంగా శిక్షన ఇవ్వాలన్నారు. విద్యాసంబంధిత అంశాలపై ఆయన అవగాహన కల్పించారు.

రేపు స్వర నీరాజనం

రాజాం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న కళాసాగర్ వేదికపై ఈనెల 11వ తేదీన పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించనున్నామని నిర్వాహకులు మంతపూడి ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బలివాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాడుతా తీయగా కార్యక్రమం, బొడ్డు వీరాస్వామి, ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థులచే ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని వాసవినగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. రహదారి పనులు సకాలంలో పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ రహదారిలో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నందున పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పాలవలస శ్యామసుందర్‌రావు, కమిషనర్ ఎల్.రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఏసీడీపీ లక్ష్మీబాయి ఆధ్వ ర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. బాలల హక్కులు, వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.

5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం 2024-25 ఏడాదికి 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి పూర్తిచేసినవారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరు తేదీ మార్చి 31 అని ప్రిన్సిపాల్ యువికే.పాత్రో తెలిపారు.

తైక్వాండో బ్లాక్ బెల్ట్ విజేతలకు అభినందన


బేబీనాయనతో విజేతలు

బొబ్బిలి: ఇటీవల విజయనగరంలో జరిగిన తై క్వాండో బ్లాక్‌బెల్ట్ టెస్టులో విజేతలుగా నిలిచిన బొబ్బిలి విద్యార్థులను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు బేబీనాయన అభినందించారు. పట్టణానికి చెందిన చరిత, తేజేశ్వర్, భరద్వాజ్, సుసాన్ నేన్సీ, జాహ్నవి, ఆదిత్య, యువకిశోర్ బ్లాక్‌బెల్టులు సాధించడంతో వారిని శుక్రవారం స్థానిక కోటలో బేబీనాయన అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో టెస్టులు నిర్వహించినట్లు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు.

పిరిడిలో ఎంపీడీవో పర్యటన

బొబ్బిలి: మండలంలోని పిరిడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు. తొలుత జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు.

'పీవీ'కి సముచిత గౌరవం

బొబ్బిలి: దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారత రత్న ప్రకటించడం ఎంతైనా సముచితమని పీసీసీ అధికార ప్రతినిధి ముప్వల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. శు క్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బహుభాషా కోవిదుడైన పీవీ ఈ దేశానికి సేవలు అమోఘమని అన్నారు. ఏనాడూ పదవులకోసం వెంపర్లాడని పీవీని పదవులే కోరి వచ్చి వరించాయని అన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'పల్లెకు పోదాం'

వేపాడ: బీజేపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 7లక్షల గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు గోకాడ మహేష్ తెలిపారు. శుక్రవారం విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరంగం దానేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్ర పార్టీ నాయకులు సన్యాసిరావు, రాష్ట్ర ఎక్స్ సర్వీస్‌మేన్ సెల్ కన్వీనర్ కేవీ.కృష్ణారెడ్డి, రాష్ట్ర యువజన మోర్చ నాయకులు ఐఎస్ఎన్ రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వారాది చిరంజీవి, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి ఆత్మగౌరవం ఢిల్లీలో తాకట్టు

జామి: వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల ప్రధాన నాయకులు రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించడం మానేసి తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో బీజేపీ పెద్దల ముందు తాకట్టు పెట్టారని లోక్‌సత్తా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శుక్రవారం ఆయన జామిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ పార్టీల నాయకులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. డిప్యూటీ సూపరెంటెండెంట్ సన్నిబాబు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాయితీపై పరికరాలు అందించాలి

రాజాం: రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆగూరు అప్పారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు రైతులకు సకాలంలో సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏడీ చంద్రరావు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, లావేటి రాజగోపాలనాయుడు, ఎంపీడీవో బాసూరు శంకరరావు, ఏఓ ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

బుడా పరిధిలో ఆరు ప్రాజెక్టుల పూర్తికి చర్యలు

● బొబ్బిలి పర్యటనలో జేసీ కార్తీక్ ● వీణల తయారీ కేంద్రం పరిశీలన

బొబ్బిలి, ఫిబ్రవరి 9: బొబ్బిలి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బుడా) పరిధిలో చేపట్టిన ఆరు ప్రాజెక్టుల పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ, బుడా వైస్‌ఛైర్మన్ కార్తీక్ తెలిపారు. శుక్రవారం ఆయన బొబ్బిలిలో పర్యటించారు. తొలుత బుడా కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 1.15 కోట్ల రూపాయలతో బొబ్బిలిలో ఇండోర్ స్టేడియం, సుందరీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. పార్వతీపురం, సాలూరు పార్కుల అభివృద్ధికి 50 లక్షల రూపాయల చొప్పున బుడా నిధులతో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. సాలూరు పట్టణంలో ఎంఐజీ లేఅవుట్‌లో 102 ప్లాట్లను ఏర్పాటు చేశామని, అందులో 20 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి ఈ నెల 15న లాటరీ వేసి స్థలాలను కేటాయిస్తామన్నారు. బొబ్బిలిలో రంగరాయపురం గ్రామ సమీపంలో ఎంఐజీ లేఅవుట్ కోసం భూసేకరణ కోసం సన్నాహాలు జరుగుతున్నాయని, ఇక్కడ లబ్ధిదారుల నుంచి డిమాండ్ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రీసర్వేలో ఎటువంటి తప్పిదాలు జరగలేదని, గతంలో భూములను అనుభవిస్తున్న వారంతా అవే సరిహద్దులతో పక్కా అనుకున్నారని, ఇప్పుడు రీసర్వేలో పూర్తిగా నిర్ధారణయ్యిందన్నారు. అందరికీ నోటీసులు జారీ చేసి, ఫీల్డు వెరిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు.


బొబ్బిలి వీణను పరిశీలిస్తున్న జేసీ

గొల్లపల్లి వీణల కేంద్రం పరిశీలన

గొల్లపల్లి వీణల కేంద్రాన్ని జాయింట్ కలెక్టరు కార్తీక్ సందర్శించి అక్కడ వీణల తయారీ కళాకారులతో మాట్లాడారు. కేంద్రం మేనేజర్ సర్వసిద్ధి రామకృష్ణ కళాకారుల సమస్యలను జేసీకి వివరించారు. వీణల తయారీకి వినియోగించే కలపను సబ్సిడీపై విరివిగా సమకూర్చాలని, కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామని జేసీ వారికి హామీ ఇచ్చారు. జేసీ వెంట అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, డీటీ రెడ్డి సాయికృష్ణ, బుడా అధికారులు చక్కా సత్యనారాయణ, ఏపీవో దేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్ ఆవిష్కరణ


మైఫస్ట్‌ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎన్ఎస్ఎఫ్

శృంగవరపుకోట, ఫిబ్రవరి 9: స్థానిక అన్న క్యాంటీన్ వద్ద శుక్రవారం 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్పు కోసం... రాష్ట్రం కోసం... భవిష్యత్ కోసం ప్రతి టీడీపీ కార్యకర్త... యువతకు చంద్రబాబు నాయుడు సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించాలని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు డెక్క ఈశ్వరరావు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్ కుమార్‌లు పిలుపునిచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత ఓటే రాష్ట్ర భవిష్యత్‌కు, చంద్రబాబు నాయుడు గెలుపునకు కారణం కావాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు గుమ్మడి గణేష్, గొర్రిపాటి రోహిణి కుమార్, భూమిరెడ్డి మోహన్‌రాజ్, అనకాపల్లి చెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్చి 10లోగా లైసెన్స్‌లు చేయించుకోండి


పాడిరైతుకు బహుమతి అందిస్తున్న డీడీ రమణ

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 9: జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు పాలకేంద్రాలు, బల్క్ మిల్క్ సెంటర్ల వారు మార్చి 10వ తేదీలోపు లైసెన్స్‌లు పొందాలని పశు సంవర్ధక శాఖ డీడీ వైవీ రమణ అన్నారు. శుక్రవారం సన్యాసయ్యపాలెం వద్ద మండల పశువైద్యాధికారిణి హేమ ఆధ్వర్యంలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఆరోగ్యకరమైన మేలు జాతి దూడలు ఉన్న వారికి బహుమతులు అందించి ప్రోత్సహించారు. మేలు జాతి లేగదూడలను ఎలా పొందాలో డీఎల్‌డీఏ జిల్లా వైద్యాధికారి ఎస్.దామోదర్ వివరించారు. డిప్యూటీ డైరెక్టర్ రమణ మాట్లాడుతూ పాడిరైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు, గడ్డి పెంపకందారులు తమ పశువులకు వసతి కల్పించేందుకు కిసాన్ క్రెడిట్ పథకం ద్వారా పావలా వడ్డీకి రూ.1.60లక్షల రుణం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాలి సన్యాసయ్య, ఎంపీటీసీ మహాలక్ష్మి, ఏడీ చలపతిరావు, గోపాలమిత్రలు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు


హెచ్చరిక బోర్డులు పెట్టిన దృశ్యం

జామి, ఫిబ్రవరి 9: ఎంతటి వారైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలకు వెనుకాడబోమని తహసీల్దార్ రాంబాయ్ హెచ్చరించారు. అట్టాడ గ్రామంలో భీమునిపట్నం సొసైటీ పేరుతో వేసిన లేఅవుట్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని సర్పంచ్ అమ్మన్నదొర కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై స్పందించారు. వెంటనే సి బ్బందిని పంపించి అందులో ఉన్న ఎకరా 64 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా సేవలు

విజయనగరం రూరల్: బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణులకు విస్తృతంగా సేవలు అందాయని ఆ సొసైటీ మాజీ ప్రతినిధులు వాయునందన శర్మ, జంధ్యాల బుచ్చిబాబు, పేరి రామయ్య పంతులు శుక్రవారం తెలిపారు. స్థానిక బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఈ సొసైటీ ఏర్పాటైందన్నారు. చంద్రబాబుని గెలిపించేందుకు బ్రాహ్మణులంతా కదలాలన్నారు.

మెగా డీఎస్సీ పేరిట దగా


మాట్లాడుతున్న కొల్లి అప్పలనాయుడు

బాడంగి, ఫిబ్రవరి 9: అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని హామీలు గుప్పించిన జగన్మోహన్ రెడ్డి కేవలం 6,100 పోస్టులను ప్రకటించడం దారుణమని విజయనగరం పార్లమెంట్ బీసీ సాధికార, కొప్పల వెలమ కన్వీ నర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. బాడంగిలో శుక్రవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఇది మెగా డీఎస్సీ కాదు దగా డీఎస్సీ అని విమర్శించారు. రాష్ట్రంలో 26 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టు లకు నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపు కోవడం దారుణమన్నారు. నిరుద్యో గుల పైన జగన్ సర్కారుకు నిజమైన ప్రేమ ఉంటే 26 వేల ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపడతామని చెప్పి నాలుగున్నరేళ్ల గడిచినా అతీగతీ లేదన్నారు. ఆయన వెంట టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు ఉన్నారు.

రికవరీలపై దృష్టి


మాట్లాడుతున్న పీడీ కల్యాణ చక్రవర్తి

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 9: జిల్లాలో కొనసాగుతున్న స్త్రీనిధి ఉన్నతి, సీఐఎఫ్ రికవరీలను మార్చి 31లోగా శతశాతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో 27 మండలాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నల్ ఆడిట్, స్త్రీనిధి, తదితర వాటికి సంబంధించి రికవరీని త్వరగా పూర్తి చేయాలన్నారు. మొబైల్ బుక్ బుకింగ్‌లో అన్ని మండలాలు ఏ గ్రేడ్‌లో ఉండాలని ఆదేశించారు. ఉద్యాన శాఖాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్‌కు మరమ్మతు పనులు


డివైడర్‌పై సెంటర్ లైట్లు వేస్తున్న దృశ్యం

రాజాం/రూరల్, ఫిబ్రవరి 9: పురపా లక సంఘం పరిధిలోని శ్రీకాకుళం రోడ్డు నుంచి బొబ్బిలి రోడ్డులోని ఆర్‌సీఎం చర్చి వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సమస్యపై కమిషనర్ ఎల్ రామప్పలనాయుడు స్పందించారు. ఈనెల 5న 'బిల్లులు రాక.. పనులు సాగక' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన నేప థ్యంలో డివైడర్‌పై ఉన్న మొక్కల కారణంగా సెంటర్ లైట్లు వెలగడం లేదని గుర్తించి మొక్కల కొమ్మలను తొల గించేలా శుక్రవారం చర్యలు తీసుకు న్నారు. సెంట్రల్ లైట్లు వెలగని ప్రాంతా ల్లో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. రానున్న వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఏఈలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఏఈ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పిండిమిల్లులో పేదల బియ్యం

● 5 క్వింటాళ్లు సీజ్


స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గిడ్డంగికి తరలిస్తున్న దృశ్యం

రాజాం రూరల్, ఫిబ్రవరి 9: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ రోడ్‌లోని ఓ పిండి మిల్లుపై రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా మిల్లులో నిల్వ ఉన్న అయిదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమాని రాంబాబుపై కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సివిల్ సప్లై గిడ్డంగికి తరలించారు. దాడుల్లో సీఎస్‌డీటీలు చిరంజీవి, సాయి కామేశ్వరరావు, ఆర్.ఐ. సాగర్ పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కిలో రూ.15కు కొనుగోలు చేసి రూ.22 నుంచి 25 వరకు తిరిగి అమ్మకం చేసేందుకు వీలుగా పీడీఎస్ రైస్‌ను కొను గోలు చేసి నిల్వ ఉంచినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

గ్యాస్ లీక్.. మహిళకు తీవ్ర గాయాలు

దత్తిరాజేరు: గ్యాస్ లీకై మహిళకు తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తాడేంద్రవలసలో శుక్రవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని మరిపి గౌరమ్మ గురువారం రాత్రి గ్యాస్ వాల్వ్ సరిగ్గా కట్టకుండా నిద్రపోయింది. శుక్రవారం ఉదయం నిద్రలేచి ఇంట్లో బల్బు స్విచ్ వేయగానే ఒక్కసారిగా గ్యాస్ నుంచి మంటలు వ్యాపించాయి. ఈమె మంటల్లో చిక్కుకుని, గాయాల పాలైంది. స్థానికులు స్పందించి, వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై స్టేషన్ బూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ, కొత్తసుంకరపాలెం గ్రామంలో మద్యం బెల్ట్ షాపును నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం రాత్రి తమకు వచ్చిన సమాచారం మేరకు కొత్త సుంకరపాలెం గ్రామానికి వెళ్లి దాడులు చేశామని, 20 మద్యంయ సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

భోగాపురం: తోటపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న బమ్మిడిపేట గ్రామానికి చెందిన బమ్మిడి రామసూరిని అరెస్టు చేసినట్టు సీఐ ఎ.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ముందుగా సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి, రామసూరిని అదుపులోకి తీసుకుని, అతని నుంచి 42 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కురుపాం/గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట సెంటర్‌లో అనధికారంగా మద్యం విక్రయిస్తున్న ఈశ్వరరావు(చంటి) అనే వ్యక్తిని పట్టుకుని, 68 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఈబీ టాస్క్ ఫోర్స్ సీఐ ఎస్.సింహాద్రి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సీతానగరం: మండల పోలీస్‌స్టేషన్‌లో గత సంవత్సరంలో 16 మద్యం కేసులు, ఒక సారా కేసులో పట్టుబడిన 898 మద్యం సీసాలను శుక్రవారం ఠాణా సమీపంలో పారబోశారు. సబ్ డివిజన్ ఏఎస్పీ సునీల్ సరోనా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రామభద్రపురం: మండల పరిధిలోని నేరెళ్లవలస సమీపంలో శుక్రవారం రాత్రి పోలీసులు జరిపిన దాడుల్లో ఇద్దరు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2200ల నగదు స్వాధీనం చేసుకున్నటు ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. వీరిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించనున్నామన్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

పాచిపెంట: మండలంలోని గురువునాయుడుపేట సమీపంలో పేకాట ఆడుతుండగా ఆ గ్రామానికి చెందిన 12 మంది జూదరులపై కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.18వేలు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు.

కోడిపందాలపై దాడి

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం పంచాయతీ కర్రి చిన్నయ్యపాలెం గ్రామంలో కోడిపందేలు ఆడుతున్నవారిపై గురువారం రాత్రి దాడి చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడులలో నలుగురు వ్యక్తులను పట్టుకుని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రెండు కోడిపుంజులతో పాటు 10 వేల 750 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

● ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 9: దేశంలో కార్మికులను, రైతులను పెట్టుబడిదారులకు బానిసలుగా చేస్తూ చట్టాల్లో మోదీ మార్పులు చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం అమర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ చట్టాల్లో మార్పులు చేస్తుంటే.. జగన్మోహన్‌రెడ్డి సీబీఐ కేసులకు భయపడి ఆ నల్ల చట్టాలను ఏపీలో అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ప్రతినిధులు టీవీ కొండలరావు, బుగత అశోక్, రంగరాజు, అప్పలరాజు, అప్పారావు, కామేష్, దుర్గారావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపాడులో ఎన్ఎస్ఎస్ శిబిరం

రేగిడి, ఫిబ్రవరి 9: తాటిపాడు గ్రామంలో రాజాం ఎన్ఎస్ఎస్ యునిట్ ఆధ్వర్యంలో శుక్రవారం వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రతినిధి పీఏఎస్ బాబూరావు ప్రారంభించారు. శనివారం జీఎంఆర్‌కేర్, జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఉపసర్పంచ్ గోవిందరావు, సొసైటీ డైరెక్టర్ పి.రామినాయుడు, పంచాయితీ కార్యదర్శి చిన్నారావు, జెమ్స్ ఆసుపత్రి ప్రతినిధి శంకర్, ఉపాధ్యాయులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పార్కులో రోడ్డు నిర్మాణానికి బ్రేక్

● యథాస్థితిని కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 9: నగరంలోని దాసన్నపేట రామకృష్ణ నగర్‌లో ఉన్న పార్కు ప్రహరీ కూల్చి... రోడ్డు వేయాలన్న నిర్ణయానికి హైకోర్టు బ్రేక్ వేసింది. 'పార్కుపై వైసీపీ నేతల కన్ను' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం వెలువడింది. దీనికి స్పందించిన స్థానికులు హుటాహుటిన హైకోర్టును ఆశ్రయించారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ పార్కుని యథాస్థితిలో ఉంచాలని కోర్టు ఉత్తర్వులలో పేర్కొంది. రామకృష్ణ నగర్ కాలనీ వాసులు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో పార్కు ఎదుట నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, కాలనీ వాసులు రజని, సబ్బి నాగమణిలు మాట్లాడుతూ పార్కును పరిరక్షించుకునేందుకు హైకోర్టును ఆశ్రయించామన్నారు. పార్కు ప్రహరీ తీసేస్తే, దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐదో డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నాగరాజు, దువ్వు రాము, పూసర్ల లక్ష్మి, సబ్బి సత్యవతి, సాయిరాజు, వంగరాపు శ్రీను, చిన్ని సురేష్, దువ్వు చిన్న తదితరులు పాల్గొన్నారు.


పార్కు ఎదుట రామకృష్ణనగర్ కాలనీ వాసుల నిరసన

పారదర్శకంగా ఓటరు నమోదు ప్రక్రియ


బీఎల్వోలకు సూచనలిస్తున్న ఈఆర్వో ప్రమీలా గాంధీ

దత్తిరాజేరు: ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా బూత్ స్థాయి అధికారులు పనిచేయాలని గజపతినగరం నియోజకవర్గ ఈఆర్వో ప్రమీలా గాంధీ సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటరు ఐటీ కార్డుల్లో చేర్పులు, మార్పులపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్వోలకు సూచించారు. ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులపై బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్నిరకాల సదుపాయాలు కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఏమైనా ఉంటే సరిచేసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన వారుంటే వెంటనే వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుదర్శనరావు, డీటీ పి.రమేష్, ఆర్ఐ భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఉపాధిలో వ్యవసాయ పనులు కల్పించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కృష్ణ

బొండపల్లి: ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ రంగంలో చేస్తున్న వివిధ రకాలైన పనులను చేసుకునేలా వెసులుబాటు కల్పించే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాళ్లపూడి కృష్ణ పేర్కొన్నారు. నెలివాడ గ్రామంలోని ఆర్బీకేలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి పథకంలో వ్యవసాయ పనులు చేసుకునేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేస్తున్న పంటలు అన్నింటినీ పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ నమోదు చేయడంతోపాటు ఈకేవైసీ పూర్తిచేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో పీవీ మల్లికార్జున రావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కోరాడ సత్యనారాయణ, లెంక అప్పారావు, సుంకరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ప్రిపరేషన్ సమయం పెంచాలి

గజపతినగరం: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రిపరేషన్ సమయం పెంచాలని, లేనిఎడల టెట్ పరీక్షలకు అభ్యర్థులకు సమయం చాలక తీవ్ర ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని సెకెండరీ గ్రేడ్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.చంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ఎంతో ఓపికతో ఉన్న అభ్యర్థులు ప్రభుత్వం హడావిడిగా పరీక్షలకు సన్నద్ధం చేయడంతో అభ్యర్థుల్లో భయాందోళన చోటు చేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రిపరేషన్‌కు సమయం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటారు

నెల్లిమర్ల: అఖిల భారత మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ మహిళా వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. శుక్రవారం హిమాచల్‌ప్రదేశ్ ధర్మశాలలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొండవెలగాడకు చెందిన ఎస్.పల్లవి 64 కిలోల విభాగంలో స్నాచ్ 80, క్లీన్ జర్క్ 100 మొత్తం 180 కిలోలు బరువెత్తి ప్రథమ స్థానంలో బంగారు పతకం సాధించింది. సీహెచ్ లక్ష్మి 81 కిలోల విభాగంలో స్నాచ్ 83, క్లీన్‌జర్క్ 102 మొత్తం 185 కిలోల బరువెత్తి ద్వితీయ స్థానంలో రజిత పతకం, బి.రాజేశ్వరి 45 కిలోల విభాగంలో స్నాచ్ 60, క్లీన్‌జర్క్ 80 మొత్తం 140 కిలోలు బరువెత్తి తృతీయ స్థానంలో కాంస్య పతకం సాధించారు. వీరిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మి నాగనరేంద్ర, సెక్రటరీ చల్లా రాము, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

నాగబాబును కలిసిన పీఏసీ సభ్యురాలు అరుణ


నాగబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అరుణ

గజపతినగరం: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు, మాజీ మంత్రి పడాల అరుణ శుక్రవారం విశాఖపట్నంలో నోవాటెల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పార్టీ బలోపేతానికి చేస్తున్న సేవల ను ఆయన దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. నియోజకవర్గంలో పార్టీ సమస్యలపై పోరాడుతూ ప్రజల పక్షాన నిలవాలని నాగబాబు సూచించినట్టు తెలిపారు. అలాగే ఉత్తరాంధ్ర పార్టీ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శరత్, పార్టీ మండల అధ్యక్షుడు మునకాల జగన్, తాళ్లపూడి సౌమిత్రి త్రివేది, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా రాజేష్ జన్మదిన వేడుకలు


వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం: జొన్నవలస గ్రామంలో టీడీపీ నాయకుడు పూసపాటి రాజేష్‌బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా పోలినాయుడు, బొద్దల నరసింగ రావు, వేచలపు శ్రీనివాసరావు. ఈగల సత్యారావు, ఎం.నారాయణప్పడు, దాసరి రమణ, బంగారుబాబు పాల్గొన్నారు.

ఇదేమి రైతు ప్రభుత్వం?

సాలూరు రూరల్: వైసీపీ ప్రభుత్వం రైతులకు విద్యుత్ సరఫరాను తగ్గించడంపై టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పర మేశు మండిపడ్డారు. టీడీపీ నేతలు కరిబు గత భాస్కరరావు, వెంకటరావుతో కలసి ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. రైతులకు దగా చేస్తున్న రైతు ప్రభుత్వంగా వైసీపీ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు ఇప్పటి వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా జరిగేదన్నారు. కొద్దిరోజులుగా ఈ వేళలను కుదించారన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు కుదించారన్నారు. అలాగే ఉదయం గంట, సాయంత్రం గంట పాటు విద్యుత్ సరఫరాలో కోత విధించారన్నారు. ఎండలు మండిపోతున్న తరుణంలో రైతులకు సరఫరా చేసే విద్యుత్‌లో కోత విధించడం దారుణమన్నారు. రైతులకు పాత విధానంలోనే విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

కురుపాం: కురుపాం ఎంపీడీవో కార్యాలయాన్ని విజయనగరం జడ్పీ సీఈవో రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆఫీసులో రికార్డులు పరిశీలించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ఎంపీడీవో అప్పారా వును అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భామిని: అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కొత్తూరు బీట్ ఆఫీసర్ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం ఆదివాసీ గిరిజన గ్రామాలైన మనుమకొండ, పాలవలస తదితర గ్రామాల్లో అవగాహన కల్పించారు. కొండపోడు కోసం నిప్పు పెట్టినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన్య ప్రాణులకు ప్రమాదం సంభవించకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన రైతులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన అవసరం

సాలూరు రూరల్: కుష్టు వ్యాధిపై అవగాహన అవసరమ ని మామిడిపల్లి సర్పంచ్ సువ్వా డ శశికళ పిలుపునిచ్చారు. గ్రామంలో శుక్రవారం కుష్టు వ్యా ధిపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధిని దాచుకోవద్దన్నారు. శరీరంపై మచ్చలుంటే వైద్య సిబ్బందికి చూపించాలన్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువు గట్టునూ వదలరా..

- అక్రమంగా మట్టి తరలింపు
- చర్యలు తీసుకోని అధికారులు
- బలహీనపడుతున్న గట్టు
- గండిపడే అవకాశం ఉందని స్థానికుల ఆందోళన

పూసపాటిరేగ: పేరాపురం పంచాయతీ పరిధిలోగల ఒక చెరువు గట్టును తవ్వేసి, మట్టిని తరలించేస్తున్నా అధికారులు చూసీచూడనట్టు ఉన్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ పరిధిలోగల గంగన్న బంద అనే చెరువు కింద సుమారుగా 70ఎకరాల మేర ఆయకట్టు ఉంది. ఈ చెరువు గట్టుకు ఉపాధిహామీ పనులు నిర్వహించి గట్టును వెడల్పు చేశారు. అయితే రెండు రోజుల కిందట ఈ చెరువు గట్టును వాహనాల ద్వారా తవ్వి మట్టిని తరలించేశారు. సాధారణంగా గృహ నిర్మాణాలకు చెరువు గర్భంలో మట్టిని తీసుకుని వెళ్లిన సందర్భాలు ఉంటాయి. అయితే ఇక్కడ ఏకంగా గట్టునే తవ్వి మట్టిని తరలించారు. దీంతో ఈ చెరువుగట్టు బలహీనంగా మారింది. వర్షాలు ఎక్కువగా కురిస్తే ఈ చెరువు గండి కొట్టే పరిస్థితికి చేరుకుంది. దీనిపై చెరువు ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే పంచాయతీ పరిధిలో ఒక చెరువుగట్టు మట్టిని తొలగిస్తే అధికారులు పట్టించుకోలేదని, దీంతో ఇది పునరావృతం అయ్యిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువుకు సంబంధించిన గట్టును తొలగించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను ప్రశ్నించాం

ఈ విషయమై స్థానిక వీఆర్వో రవిని వివరణ కోరగా.. కొంతమేర జిరాయితీగా ఉండగా, మిగిలిన ప్రాంతంలో చెరవును తవ్వడాన్ని గుర్తించామన్నారు. తొలగించిన వారిని ప్రశ్నించామని చెప్పారు.


చెరువుగట్టును తవ్విన దృశ్యం

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో భాస్కరరావు
- జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విజయనగరం రింగురోడ్డు: నులి పురుగుల నిర్మూలనతో పిల్లల ఆరోగ్యానికి రక్షణ ఏర్పడుతుందని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయనగరం జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. నగరంలోని కంటోన్మెంట్‌లోని నగరపాలక సంస్థ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జిల్లాలో 4,834 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, విద్యా సంస్థలు ద్వారా 3 లక్షల 80 వేల మందికి ఈ మాత్రలు పంపిణీ చేశామని చెప్పారు. డాక్టరు రవికుమార్, డీపీఆర్వో రమేష్, ఎంఈవో సత్యవతి, వైద్యాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట రూరల్:** మండలంలోని కొట్టాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు అందించారు. ● **రాజాం:** పురపాలక సంఘం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పురపాలక సంఘం కమిషనర్ ఎల్.రామప్పలనాయుడు నులిపురుగుల నివారణ మాత్రలను అందించారు. బొద్దాం ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో బాసూరు శంకరరావు విద్యార్థుల తో ఈ మాత్రలను మింగించారు. ● **రేగిడి:** మండలంలో రేగిడి, బూరాడ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో 19 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. రేగిడి పీహెచ్‌సీలో డాక్టర్ అశిరినాయుడు, సోమరాజుపేట సచివాలయంలో డా.చలమయ్య ఆధ్వర్యంలో పిల్లలతో ఈ మాత్రలు మింగించారు. ● **బాడంగి:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు చేతులమీదుగా ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. ● **తెర్లాం:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను ఎంపీడీవో బి.మధుసూదన రావు, తహసీల్దార్ ఎస్.దిలీప్‌చక్రవర్తి, పీహెచ్‌సీ వైద్యులు డి.దివ్యభారతి పంపిణీ చేశారు. ● **రామభద్రపురం:** ఆరికతోట పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం 2,800 మంది పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేసినట్టు వైద్యుడు రవికృష్ణ తెలిపారు. ఆరికతోటలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ● **కొత్తవలస:** వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో వివిధ పాఠశాలలో విద్యార్థులతో డీవార్మింగ్ మాత్రలను మింగించారు. వియ్యంపేటలోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు, వియ్యంపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు మత్రలు అందించారు. ● **వేపాడ:** వేపాడ పీహెచ్‌సీ పరిధిలోగల గ్రామాల్లో 4,259 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించామని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ధరణి అన్నారు. ● **డెంకాడ:** పెదతాడివాడ గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్‌కుమార్ ఆల్బండజోల్ మాత్రలు మింగించారు. ● **బొండపల్లి:** బొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ చల్లా చలంనాయుడు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో రాణి, ఎంపీడీవో ఎస్.హరిహరరావు, బొండపల్లి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో

భారీ వాహనాలతో ఇక్కట్లు


ఓవర్ లోడుతో వెళ్తున్న చెరకు ట్రాక్టర్

రాజాం రూరల్: పరిమితికి మించిన బరువుతో పట్టణం మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్రషింగ్ సీజన్ కావడంతో ట్రాక్టర్లు, లారీలు, ఊక, చెరకు ఇతరత్రా భారీ లోడులతో రాకపోకలు సాగిస్తుండడం వల్ల పట్టణంలో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వాస్తవానికి ఇలాంటి వాహనాలు రాత్రివేళల్లో రాకపోకలు సాగించాల్సి ఉంది. పోలీసుల పర్యవేక్షణ కొరవడ డంతో రోజంతా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రద్దీ వల్ల ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయం ప్రజల్లో నెలకొంటోంది. చెరకు ట్రాక్టర్లు బోల్తాపడిన సందర్భాలు ఈ ప్రాంతంలో లేకపోలేదు. ఇలాంటి వాహనాలు రాత్రివేళ రాకపోకలు సాగించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

నోటిఫికేషన్ వచ్చే వరకు పరిశీలించండి


మాట్లాడుతున్న ఎన్నికల డీటీ నారాయణమ్మ

కొత్తవలస: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు బీఎల్వోలు ఫారం-6, 7, 8 క్లెయిమ్స్‌ను పరిశీలించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్‌లు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఈ ప్రక్రియ కొనసాగాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎన్నికల డీటీ నారాయణమ్మ, కొత్తవలస డీటీ టి.రమేష్, రీసర్వే డీటీ జె.కోటఅప్పారావు పాల్గొన్నారు.

మోటార్ మరమ్మతుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, డీఈఈ

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీలో వాటర్ వర్క్స్ నిర్వహణకు సంబంధించి ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి భోజరాజపురం వాటర్‌వర్క్స్‌ను పరిశీలించారు. వేగావతి నదిలో ఉన్న ఇన్‌ఫిల్ట్రేషన్ బావులను పరిశీలించారు. మరమ్మతులకు గురైన మోటార్లను వినియోగంలోకి తీసుకు రావాలని డీఈఈని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా నీటి పంపింగ్, సరఫరా వ్యవస్థను సిద్ధంగా ఉంచాలన్నారు. ఐటీఐ కాలనీ సమీపంలో నిర్మితమవుతున్న ఇండోర్ స్టేడియం పనులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట డీఈఈ కనకరాజు, ఏఈలు రవికుమార్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు శిక్షణ ప్రారంభం

కురుపాం రూరల్: చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు, మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 30 మంది గిరిజన మహిళలకు 45 రోజులు ఇచ్చే కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని గొటివాడ గ్రామంలో కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. గిరిజన మహిళలు కుట్టు శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.సొసైటీ డైరక్టర్ షేక్ గౌష్, మహిళా వెల్ఫేర్ సంస్థ డైరక్టర్ పద్మ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

సీతానగరం: ఎన్నికల విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ జనార్ధనరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ చిట్టెమ్మ, వివిధ గ్రామాల బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలన

మక్కువ: అనసభద్ర గ్రామ సమీపంలో చేపడుతున్న ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను ఇంజినీరింగ్ చీఫ్ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈనెల 14న పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శాంతేశ్వరరావు, డీఈ మనోజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ప్రకృతి వ్యవసాయంపై సదస్సు

గరుగుబిల్లి: తోటపల్లి జట్టు ప్రాంగణంలో శనివారం ప్రకృతి వ్యవసాయ విధానంలో జీడి తోటల పెంపకంపై సదస్సు నిర్వహించనున్నట్లు జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి డైరెక్టర్ జనరల్ ఆర్పీ సిసోడియా హాజరవుతున్నారన్నారు. జీడి తోటల నిర్వహణపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించను న్నట్లు తెలిపారు. ఉత్తమ జీడి రైతులకు జీడి రత్న పేరుతో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఆశీలు వేలం ఖరారు

పాలకొండ: నగర పంచాయతీకి చెందిన రోజువారీ మార్కెట్ ఆశీలు, రోడ్డు మార్జిన్, వారపు సంతలు, చెట్ల ఫలసాయం, కబేళా, వ్యాపారుల రోజువారీ కలెక్షన్‌కు సంబంధించిన ఆశీలు వేలం పాట శుక్రవారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ముగ్గురు పాటలో పాల్గొన్నారు. ఇద్దుబోయిన మహేష్ రూ.9,71,000కు పాటను దక్కించుకున్నారు. కౌన్సిల్ ఆమోదం పొందిన తర్వాత ఆశీలు వసూలు చేసుకోవచ్చునని కమిషనర్ తెలిపారు.

ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి: జేసీ


రేషన్ పంపిణీ పరిశీలిస్తున్న జేసీ

కలెక్టరేట్: ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలని జేసీ కార్తీక్ ఆదేశించారు. కణపాక సాయినగర్ కాలనీలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రేషన్ సరుకుల పంపిణీపై ఆరా తీశారు. తూకాన్ని, నాణ్యతను తనిఖీ చేశారు. వేలి ముద్రలు పడకపోతే, ఐరిస్ ద్వారా నిర్ధారించి సరుకులు పంపిణీ చేయాలన్నారు. రేషన్ ఇచ్చే తేదీని వలంటీర్లు ముందుగానే కార్డుదారులకు తెలియజేయాలని చెప్పారు. ఆయనతో డీఎస్‌వో మధుసూధనరావు, తహసీల్దార్ రత్నం తదితరులు ఉన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలించాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి రమ్య

విజయనగరం (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీని నిర్మూలించాలని.. పిల్లలతో వివిధ రకాలైన పనులు చేయించరాదని అడిషినల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి.రమ్య అన్నారు. కొత్త ధర్మపురిలోని జువైనల్ జస్టిస్ హోంలో వెట్టిచాకిరీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిఈడు పిల్లలకు ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ ఏటీ శ్రీనివాస్ మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టరాదని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టు ఎస్‌వీ రమణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజరాజేశ్వరి, ఎన్జీవో ప్రతినిధి జీకే దుర్గ, వివిధ శాఖల అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి


ప్రదర్శన ఇస్తున్న కళా బృందం

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి అన్నారు. మండల కేంద్రంలోని వసంతుల వీధిలో శనివారం 'బేటీ పడావో...బేటీ బచావో' కార్యక్రమంలో భాగంగా కళాజాతా నిర్వహించారు. ఆడపిల్లలకు రక్షణ ఇద్దాం...ఆడపిల్లలను చదివిద్దాం అనే నినాదాలతో సాగిన ఈ కళాబృందం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రత్నకుమారి, కృష్ణకుమారి, మండల కేంద్రంలోని 8 అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి

సాలూరు: దేశ వ్యాప్తంగా ఈనెల 16 నుంచి చేపట్ట నున్న గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని సం యుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాలు, జేఏసీ ఉమ్మడిగా పిలుపునిచ్చాయి. శుక్రవారం సాలూరులోని సీఐటీయూ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు రామచంద్రరావు, ఎన్‌వై నాయుడు మాట్లాడారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నా మని చెప్పారు. 125 ప్రపంచ దేశాల్లో ఆకలి బాధల్లో భారత్ 11వ స్థానంలో ఉందని విమర్శించారు.

క్లుప్తంగా..

పదో రోజుకు మిమ్స్ ఉద్యోగుల రిలే దీక్ష

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే దీక్షలు శనివారం పదో రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఆర్వోబీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన శిబిరంలో మిమ్స్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు టీవీ రమణ పాల్గొని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరీ


కచేరీ నిర్వహిస్తున్న అమ్మాజీ

బొబ్బిలి: స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయ మండపంలో శుక్రవారం సాయంత్రం తాళాబత్తుల అమ్మాజీ గాత్ర కచేరి ఆహూతులను అలరించింది. నరిసింగరావు, శ్రీనివాసరావులు వయొలిన్, మృదంగంపై వాద్య సహకారం అందించారు. స్థానిక రోటరీ క్లబ్, సామాజిక సంస్థల ప్రతినిధులు జేసీ రాజు, జోసెఫ్, సింహాచలం తదితరులు కళాకారులను సత్కరించారు.

నేడు, రేపు పరదేశమ్మ తీర్థం


పరదేశమ్మతల్లి

వేపాడ: చినగుడిపాల గ్రామంలో శని, ఆదివారాలలో గ్రామ దేవత పరదేశమ్మ తీర్థ మహోత్సవం నిర్వహించనున్నట్టు సర్పంచ్ బోజంకి రామునాయుడు, నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.